క్లుప్తంగా

శనీశ్వరుడికి తైలాభిషేకం


అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుని పాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబాస్వామి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమ అభిషేకం అర్చనలు, పంచామృత అభిషేకం, తైలాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ముగిసిన తైక్వాండో పోటీలు


తైక్వాండో విజేతలు వీరే

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాలులో ఆదివారం రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. రాయలసీమ ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, కర్నూలు జిల్లా క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచినట్లు తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి తెలిపారు. విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరినాథరెడ్డి, సభ్యులు రాజానాయుడు, సంజీవరెడ్డి మెడల్స్ అందజేశారు.

బాలిక అదృశ్యం


మేఘన(ఫైల్)

యాడికి: మండల కేంద్రంలో బాలిక అదృశ్యమైంది. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన శ్రీరాములు కుమార్తె మేఘన ఇంటర్ వరకూ చదివి ఇంటి వద్దే ఉంటోంది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. అయితే తెల్లవారుజామున లేచి చూసేసరికి కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని బాలిక ఆచూకీ గాలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


కాంట్రాక్ట్ రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్రైం: నగరంలోని పాతూరు చెస్ట్ డీసీస్ (సీడీ) ఆస్పత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రేడియాలజీ టెక్నీషియన్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం జరిగింది. సమావేశంలో టెక్నీషియన్ల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అంజెడాను సిద్ధం చేశారు. రెగ్యులర్ రేడియోగ్రాఫర్లతో సమానంగా 11 నెలల వరుస విధి నిర్వహణ తర్వాత నెల రోజుల సెలవు, ఏపీవీవీపీ, డీఎంఈ, డీహెచ్ పరిధిలో భవిష్యత్తులో జరిగే నియామకాలు కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయాలని, తదితర డిమాండ్లతో తీర్మానం చేశారు. సమావేశంలో అసోసియేషన్ ఏపీ అమరావతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శివప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అసోసియేషన్ ఇదే: జిల్లా అధ్యక్షుడిగా వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, సభ్యులుగా విశ్వమూర్తి, లోకేష్, రామకృష్ణ, సునీల్ కుమార్‌ను ఎంపిక చేశారు.

భూమి భద్రం.. హక్కు శాశ్వతం

- మండలంలో భూ సమగ్ర సర్వే ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


నిట్టూరులో భూముల రీ సర్వే చేస్తున్న అధికారులు

యల్లనూరు: భూముల రీ సర్వే...భూ యజమానులకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఓ మహా యజ్ఞం. దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరిస్తూ పక్కా హద్దులతో శాశ్వత హక్కు పత్రాలను పైసా ఖర్చు లేకుండా పంపిణీ చేస్తోంది. ఈ బృహత్తర పథకం వివిధ శాఖల సమన్వయంతో యల్లనూరు మండలంలో సాగుతోంది. రైతన్నల్లో సంతోషం నింపుతోంది.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

వందేళ్ల నాటి భూ సమస్యలు, వివాదాలను పరిష్కరించడంతోపాటు పకడ్బందీగా భూ హక్కు పత్రాలను ఆయా యజమానులకు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు నడుం బిగించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు -భూరక్ష కార్యక్రమం పట్ల సర్వత్రా రైతుల సంబరాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలోని నిట్టూరు గ్రామంలో రీసర్వే కొనసాగుతోంది. కలెక్టరు గౌతమి, జేసీ కేతన్ గార్గ్, ఆర్డీఓ మధుసూదన్ ఎప్పటికప్పుడు తహసీల్దార్‌కు సూచనలిస్తూ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

అంగుళమైనా తేడా లేకుండా పక్కాగా .....

సర్వే ఆఫ్ ఇండియా ద్వారా క్యాజీఐఎస్‌లోకి మార్పు చేసి భూ యజమానులు వాస్తవంగా చూపించిన సరిహద్దులను పోల్చి కొలతలు వేస్తున్నారు. యల్లనూరు మండలంలో నిట్టూరు, బుక్కాపురం, ఆరవేడు, కాచర్లకుంట గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. నిట్టూరు పరిధిలో వన్‌బీ ప్రకారం సుమారు రైతులు 655 మంది, గ్రామ పొలం విస్తీర్ణం 1,645 ఎకరాలు ఉంది. ఆ భూములన్నీ అంగుళం కూడా తేడా రానీయకుండా సూక్ష్మ పరిశీలనతో రీ సర్వే ప్రక్రియ దశల వారీగా అధికారులు చేపడుతున్నారు. సర్వే విభాగం, రెవెన్యూశాఖ సమాంతరంగా పని చేస్తూ ఈ యజ్ఞాన్ని వేగవంతం చేశారు.

మరెన్నో ఉపయోగాలు...

పాస్ పుస్తకంలో పొందుపరిచిన భూముల వివరాలు కాక ఇతర లావాదేవీల కోసం కొత్త భూమి యాజమాన్య హక్కు పత్రం/ పట్టాదారు పాసుపుస్తకం తీసుకోవడం. మరో మార్గంలో అయితే ఆ వివరాలతో కూడిన వన్‌బీ నమూనా, గ్రామ/వార్డు సచివాలయాల్లో లేదా మీ సేవలో పొందవచ్చు. బ్యాంకు రుణం తీసుకునేటప్పుడు గానీ, భూమి యాజమాన్యపు హక్కుపత్రం, పట్టాదారు పాసుపుస్తకం అధికారికంగా చూపించాల్సిన అవసరం లేదు. పాసుపుస్తకం పోయినా ...చిరిగిపోయినా గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్ణీత రుసుం చెల్లించి నకలు పొందొచ్చు.

పైసా ఖర్చులేదు



నాకు ఎకరా భూమి ఉంది. ఇప్పుడు రీ సర్వేతో నా భూమికి యాజమాన్యపు హక్కు పత్రాలు అందిస్తున్నారు. ఇంత మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు . ప్రభుత్వం ఈ విధమైన కార్యక్రమం చేయడం అభినందనీయం. ఒక్కపైసా ఖర్చు లేకుండా శాశ్వత భూ హక్కు పత్రాలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

– శ్రీనివాసరెడ్డి, రైతు నిట్టూరు

భూ సమస్యలకు పరిష్కారం



ప్రస్తుతం నిట్టూరు, కాచర్లకుంట పొలాల్లో రీ సర్వే కార్యక్రమం జరుగుతోంది. విడతల వారిగా మండలం మొత్తం పూర్తి చేసి ఎవరి భూములను వారికి అప్పగిస్తాం. గ్రామాల్లో చాలా సమస్యాత్మకంగా ఉన్న భూముల సమస్యలకు పరిష్కారం దొరికింది. రీ సర్వే అయిన వెంటనే శాశ్వత హక్కు పత్రాలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం. రైతులు రీ సర్వేకి సహకరించాలి.

– తహసీల్దార్ రమాదేవి, యల్లనూరు

రేపటి నుంచి రక్షణ ఉజ్జీవ సువార్త సభలు

పామిడి: పట్టణంలోని క్రీస్తు కల్వరి ప్రార్థన మందిరంలో మంగళవారం నుంచి రెండురోజుల పాటు రక్షణ ఉజ్జీవ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రార్థన మందిరం పాస్టర్ సురేంద్ర ఆదివారం తెలిపారు. సభలకు కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పట్టణ పాస్టర్ ఓబుల్‌రావు హాజరవుతారన్నారు. సభల్లో క్రైస్తవ విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని దేవుని మహిమను పొందాలని కోరారు.

అస్సాం యువకుడికి రిమాండ్

గార్లదిన్నె: అస్సాంకు చెందిన పప్పుబాగ్ అలియాస్ (రాజు) అనే యువకుడు ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పోలీసులు యువకుడిని అరెస్ట్ చేసి అనంతపురం జిల్లా కోర్టులో హాజరు పరిచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

అగ్ని ప్రమాదంతో పంట నష్టం


కాలిపోయిన మొక్కజొన్న కంకులు

పుట్లూరు: కడవకల్లు గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు పంట పొలాలకు మంటలు వ్యాపించడంతో పలువురు రైతులకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రాఘవేంద్ర, నాగేంద్ర, కుళ్లాయప్ప, బాలప్ప అనే రైతులకు చెందిన మొక్కజొన్నతో పాటు డ్రిప్పు పరికరాలు, పైపులు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో గాలులు ఎక్కువగా ఉండటంతో మంటలను అదుపుచేయలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

పుట్లూరు: మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పి.చింతలపల్లి వద్ద మూడు స్తంభాలు, జీసీపల్లి వద్ద రెండు స్తంభాలు నేలకొరిగినట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయుడు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: నిరుద్యోగులు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి సూచించారు. కియా అన్సిలరీ యూనిట్స్ రిత్విక్ ఎంటర్‌ప్రైజెస్ వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆమె ప్రారంభించారు. ఇంటర్వ్యూల్లో నిరుద్యోగ యువతీ, యువకులు ప్రతిభ కనబరచాలని ఆమె సూచించారు. కాగా కియా పరిశ్రమలో క్వాలిటీ చెకింగ్, ప్రొడక్షన్, మెటీరియల్ ప్యాకింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 150 ఉద్యోగాలను భర్తీ చేయడానికి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 200 మంది నిరుద్యోగులు హాజరైనట్లు రిత్విక ఎంటర్‌ప్రైజెస్ హెచ్‌ఆర్ ప్రతినిధి బి.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణ, చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఖలీల్, గఫార్, షాబుద్దీన్, రాజేష్, సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం తాడిపత్రి రహదారి ప్రక్కన వెలసిన వాల్మీకి రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామి వార్లకు మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరహరి, నాయకులు గంగాధర్, నారాయణస్వామి, కిశోర్, జయప్రసాద్, శ్రీధర్, రమణ, ఓబిలేసు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ రావాలి


అడవికొట్టు రాజును సన్మానిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, నాయకులు

శింగనమల: జగనన్న సంక్షేమ పాలన 2024లో మళ్లీ రావాలని కోరుతూ బైక్ యాత్ర చేపట్టినట్లు నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికొట్టు రాజు అన్నారు. ఆదివారం శింగనమలకు రావడంతో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాజు, భాస్కర్, సురేష్, నాగేంద్ర అతడిని సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 14న బైక్‌యాత్ర ప్రారంభించానన్నారు. అనంతరం అక్కడి నుంచి గుంతకల్లు నియోజకవర్గానికి బయలుదేరి వెళ్లారు.

పామిడి: నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామవాసి అడవికొట్టు రాజు చేపట్టిన బైక్ యాత్ర ఆదివారం పామిడికి చేరింది. ఈసందర్భంగా స్థానిక హైవేలో బైక్ యాత్రికున్ని స్థానిక వైఎస్సార్‌సీపీ పెద్దకాలువ వినోద్ కలిశారు. నెల్లూరు జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాల కొండారెడ్డి ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


గుంతకల్లుటౌన్: సదస్సులో మాట్లాడుతున్న మెప్మా సీఎంఎం భవాని


పామిడిలో రుతుక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

గుంతకల్లుటౌన్: మహిళలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని మెప్మా సీఎంఎం భవాని సూచించారు. ఆదివారం పట్టణ సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ఋతుస్రావం అనేది సహజ ప్రక్రియ అని, అయితే నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబం, పిల్లల బాధ్యత, ఆఫీసు సమస్యల మధ్య మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది మహిళలు, యువతుల నెలసరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భసంచి క్యాన్సర్ రావడానికి గల కారణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్, ఏఎస్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని భవిత కేంద్రంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో మహిళ జీవితంలో రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు రుతుక్రమ సమయంలో పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. రుతుక్రమముపై గల అపోహలు, సందేహాలను ఆమె నివృత్తి చేశారు. అనంతరం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ చంద్రశేఖర్, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

‘బంగారు’లేడీ దొరికింది

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పైసా పైసా కూడబెట్టుకొని నల్లపూసల గొలుసు (బంగారు) కొనుగోలు చేసిన ఓ మహిళ దేవుడి పాదాల వద్ద ఉంచి పూజ చేయించి, ధరించాలనుకుంది. అంతలోనే ఆలయంలోనే గొలుసు మాయమైంది. బాధితురాలు ఈనెల 21న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు నల్లపూసల గొలుసు అపహరించిన దొంగ (మహిళ)ను గుర్తించి, పట్టుకున్నారు. విచారణలో ఆ మహిళ పాతనేరస్తురాలుగా తేలింది. వడ్డీవ్యాపారి కూడా కావడం గమనార్హం. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి వెల్లడించారు. నగరంలోని మొదటి రోడ్డులో నివాసం ఉంటున్న సావిత్రి అనే మహిళ నల్లపూసల గొలుసు (బంగారు) చేయించుకుంది. ఈ నెల 21న బ్రాహ్మణవీధిలోని బృందావనం ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి, స్వామి పాదాల చెంత ఉంచి పూజ చేయించింది. అదేరోజున వ్యాసరాజ మఠం పీఠాధిపతి కూడా వస్తున్నారని తెలుసుకొని అక్కడికి త్వరగా చేరుకుంది. అందరిలాగానే బంగారు గొలుసును పూజారికి ఇచ్చింది. పూజ అనంతరం పూజారి గొలుసును ఆమెకు అందించారు. ఈ విషయాన్ని గమనించిన కిలాడీ లేడీ(జింకల లత) తెలివిగా మహిళను ఏమార్చి ఆమె బ్యాగులో దాచిన పర్సును తస్కరించింది.

చోరీల నేపథ్యం ఇదీ..


కిలాడీ లేడీ చోరీ సమయం లోని సీసీ పుటేజీ దృశ్యం

స్థానిక ఐదో రోడ్డులో నివాసం ఉంటున్న జింకల లత వడ్డీ వ్యాపారం చేస్తోంది. డబ్బు మీద వ్యామోహంతో సులభంగా డబ్బు సంపాదించే మార్గాన్ని ఎంచుకుంది. అందుకు చోరీలు చేస్తేనే సాధ్యమని భావించింది. గతంలో చిన్న చిన్న చోరీలు చేసి, అనంతపురం సీసీఎస్ పోలీసులకు కూడా పట్టుబడింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. సావిత్రి పర్సును కాజేసి, బంగారు గొలుసును అనంతపురంలో విక్రయిస్తే పోలీసులు గుర్తిస్తారని భావించి, ధర్మవరంలో విక్రయించాలని బయల్దేరింది. కలెక్టరేట్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్న ఆమె (జింకల లత) అటుగా వస్తున్న పోలీసు జీపును చూసి ఉడాయించాలని చూసింది. అనుమానంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా, అసలు విషయం బయటపడింది. దీంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

నేటి కార్యక్రమాలు

‘గడప గడపకూ మన ప్రభుత్వం’

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బస్టాండ్ సర్కిల్ నుంచి సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

గుంతకల్లుటౌన్: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపిన ఏపీ సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతిలో నిరుపేద ప్రజలకు ఇంటిస్థలాలిచ్చి వారి సొంతింటి కలను సాకారం చేయనున్న సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీకి ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్ల పూర్తి, అమరావతిలో పేదలకు ఇంటి పట్టాల పంపిణీకి మద్దతుగా సోమవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయాల రూరల్ కన్వీనర్ సుభాష్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాల్గొననున్నారని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

‘స్పందన’

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇదిలా ఉండగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

విత్తన వేరుశనగ పంపిణీ

గార్లదిన్నె: ని ఎగువపల్లి వైఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు విత్తనకాయల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. అలాగే వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు.

బుక్కరాయసముద్రం: మండలంలో సోమవారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి కే–6 2300 క్వింటాళ్లు, 1812 రకం 50 క్వింటాళ్లు వచ్చాయని పేర్కొన్నారు. ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే విత్తనకాయలు అందిస్తామని తెలిపారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ఉన్న 15 రైతు భరోసా కేంద్రాలలో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఏఓ ముస్తాక్ అహ్మద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్నేదొడ్డి రైతు భరోసా కేంద్రంలో ఉదయం 11 గంటలకు వేరుశనగ పంపిణీని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శింగనమల: మండలంలోని ఆర్బీకేల్లో సోమవారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ చిన్నమ్మ తెలిపారు. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న రైతులు డబ్బులు చెల్లించి విత్తనకాయలు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

సంతల ద్వారా రూ.3.56 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.56 లక్షలు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,05,680 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,50,850 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాహుకేతు హోమాలు, పల్లకీసేవ, ఆకుపూజ, కుజదోష, కాలసర్పదోష నివారణ కోసం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలమంత్ర బీజాక్షర హోమం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జేసీఎన్‌ఆర్ఎం డిగ్రీ కళాశాల 1994–97 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు ఆకుల చిన్ననాగిరెడ్డి, పుల్లయ్య, జూన్ సురేష్ ఆధ్వర్యంలో అప్పటి అధ్యాపకులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, చలమారెడ్డి, కృష్ణారెడ్డి, దస్తగిరి, రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. పూర్వ అధ్యాపకులు, విద్యార్థులు 25 సంవత్సరాల కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు రంగనాయకులు, శ్రీధర్‌రెడ్డి, రోశిరెడ్డి, కృష్ణారెడ్డి, శివలింగారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే సీమ సమస్యల పరిష్కారం


అంతర్జాలం ద్వారా ప్రసంగిస్తున్న సీనియర్ కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: ప్రజా చైతన్యంతోనే రాయలసీమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రముఖ కవి జెట్టి జైరాం అన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి పేరిట ఏర్పాటు చేసిన అంతర్జాల వేదికగా మహాకవి సమ్మేళనం జరిగింది. కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు తమ కవితాగానం చేశారు. సీనియర్ కవి జెట్టి జైరాం, హరినాథరెడ్డి, బొజ్జాదశరథరామిరెడ్డి, జనసాహితి సూర్యసాగర్, రైతు నాయకులు లోచర్ల విజయభాస్కరరెడ్డి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో వాసంతి, రవికుమార్, రాజశేఖరరెడ్డి, నిర్మల సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అంతకుముందు ఇటీవల దివంగతులైన కేతు విశ్వనాథరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సాహితీ విలువలను గుర్తు చేసుకున్నారు.